# దొంగొచ్చాడు

"ఆరోజు రాత్రి రాజు గారింటికి కన్నం వేశాడు. దొంగ..."అంటూ శ్యామల కథ చెబుతూ మంచంమీద నడుం వాల్చింది.

"దొంగ ఎలా వుంటాడమ్మా?" అనడిగింది నాలుగేళ్ళ చిట్టి - కళ్ళు చిట్లించి గదిపైకప్పు నుంచి వేలాడుతోన్న దీపం వేపు చేస్తూ.

"ఎలా ఉంటాడంటే... ఊ.... ఎలా ఉంటాడంటే.. పెద్ద పెద్ద మీసాలు పెట్టుకొనీ...చారల, చారలచొక్కా వేసుకొనీ.. గళ్ళ లుంగీ కట్టుకొనీ..." అంటూ సినిమా 'దొంగ' ని ఊహించుకుంటూ చెబుతోంది శ్యామల.

"అంటే మన పక్కింటి అంకుల్‌లా ఉంటాడన్నమాట!...అయితే పక్కింటి అంకుల్ దొంగేనన్నమాట!" టక్కున అంది ఆ పిల్ల! అదిరిపడి చూసింది శ్యామల చిట్టివేపు- "కొంప ముంచేట్టున్నావు గదే.. మరీ అంకుల్‌తోనో, ఆంటీతోనో అనేవ్! తమాషాకు అలా చెప్పాను. నిజానికి దొంగంటే ప్రత్యేకంగా ఏమీ ఉండడు. అందర్లాగే ఉంటాడు పేంటూ చొక్కా వేసుకొనీ..."

"అంటే అందరూ దొంగలేనన్నమాట!!"

"అబ్బా! దీంతో...ఏయ్... చిట్టీ! అందరూ దొంగలు ఎలా అవుతారే?..." అంటూ శ్యామల తల పట్టుకుంది.

"మరీ!!!" అంది నొసలు ముడివేసి - చిట్టి.

"ఒకరి వస్తువులు తీసుకెళ్ళేవాళ్ళు దొంగలవుతారు. వాళ్ళు ఆడవాళ్ళు కావచ్చూ, మగవాళ్ళు కావచ్చు."

"ఆ తెలిసింది, తెలిసింది.. మన పిండి జల్లెడ ఎప్పుడూ తీసుకుపోతుందే ఎదురింటి పిన్నీ.. - ఆమె దొంగేనన్నమాట!"

"నీ తెలివి యేడ్చినట్టుంది పోవే...అడిగి తీసుకుపోవడం దొంగతనం అవదు...మన వస్తువుల్ని ఎవరయినా మనకీ తెలీకుండా తీసుకెళ్ళారనుకో-వాళ్ళు దొంగలవుతారు. అలాగే ఎవరి వస్తువులన్నా మనం వాళ్ళకి తెలీకుండా తెచ్చుకున్నామనుకో, అప్పుడు మనం కూడా దొంగలమవుతాం - తెల్సిందా?"

"ఊ.....తెల్సింది" అంది చిట్టి - ఆవులిస్తూ.

"ఏం తెలీడమో.. దొంగకథ వింటావా? ఇలా ప్రశ్నలు వేస్తూనే ఉంటావా?" అంది శ్యామల చాలా ఓపిగ్గా.

"అమ్మా అమ్మా...మనం దొంగలయతే బావుంటుంది కదే...ఎంచక్కా మనకి లేని వస్తువుల్ని ఎవరి దగ్గర్నించైనా తెచ్చుకోవచ్చు. పద్మ దగ్గర జిరాఫీ బొమ్ముంది... అది తెచ్చుకుంటానే" అంది హుషారుగా.

"ఆ, తెచ్చుకో, తెచ్చుకో... అలా తెచ్చుకొంటే, నువ్వు దొంగపిల్లవనీ - పోలీసులు పట్టుకుపోయి జైల్లో పెడతారు . ఏమనుకున్నావ్!" అంది శ్యామల - కాస్త కోపాన్ని మిళితం చేస్తూ.

"అమ్మో - పోలీసులే" అంది చిట్టి భయంగా వాళ్ళమ్మ వేపు చూస్తూ.

చలం 'బిడ్డల శిక్షణ' ఎందుకు చదివానా అని ఆ క్షణంలో విసుక్కుంది శ్యామల.

"అప్పుడేమయిందంటే... ఆ....ఆ దొంగ..." అంటూ కథ చెప్పడం కొనసాగించింది శ్యామల.

ఓ అయిదు నిమిషాల తర్వాత 'టక్‌టక్' మంటూ తలుపు చప్పుడయింది. 'శ్యామూ' అంటూ భర్త పిలుపు కూడా వినిపించింది.

"ఏయ్ చిట్టీ! మీ నాన్న..." అన్నది శ్యామల, పాపతో- తలుపు తీయడానికి లేస్తూ. గోడ గడియారం వేపు చూసింది పదయింది.

అప్పటికే పాప నిద్రపోయింది.

★ ★ ★

ఉదయం పది గంటలయింది.

బయటి గదిలోనే ఓమూలలో పక్కింటి పద్మా, రాధలతో అన్నాలు వండి వార్చే ఆట ఆడడంలో నిమగ్నమయి వుంది చిట్టి.

"ఏయ్ చిట్టీ! స్టోర్లో చక్కెర తెద్దాం రా!" అంటూ పిల్చింది శ్యామల - చేతిలో సంచీ, కార్డూ పట్టుకుని.

"నేను రానమ్మా, ఆడుకుంటున్నాను" అంది చిట్టి తలయినా ఎత్తకుండానే.

"మరైతే నేను తొందరగా వచ్చేస్తా ఎక్కడికీ వెళ్ళొద్దమ్మా ఇల్లు వదిలి - అర్థమయ్యిందా" అనేసి, సమాధానం కోసం చూడకుండా వెళ్ళిపోయింది శ్యామల.

కాసేపటికి ఓ లావాటి ఆవిడ వాకిట్లో నుంచుని 'ఒసే పద్మా! రాధా!... మీ డాడీ వచ్చారు రండి!" అంటూ పిల్చింది.

అంతే - చిట్టిని వదిలేసి పరుగెత్తికెళ్ళిపోయారు పద్మా, రాధలు.

వాళ్ళు వెళ్ళిన వేపు ఓసారి చిత్రంగా చూసి ఒక్కతే ఆడుకుంటూ వుండిపోయింది చిట్టి.

మరికాసేపటికి కాంపౌండు గేటు 'కిర్రు' మంటే తల్లి వస్తుందేమోనని తలెత్తి చూసింది చిట్టి.

తల్లి రాలేదు కానీ - ఎవరో మగవాడు! లావాటి మీసాలూ, సన్నని నీలపు చారలున్న తెల్లటి చొక్కా - అదే రంగు ప్యాంటు వేసుకుని వున్నాడు. లావుగా వుండీ, చామనఛాయగా వున్నాడు. అతను మెట్లెక్కేసి ఏకంగా గదిలోకి దూసుకొచ్చేశాడు.

"మీ అమ్మ ఎక్కడమ్మా!" అడిగాడు అతను. అదిరిపోయింది చిట్టి.

"లేదు - స్టోరుకెళ్ళింది!" అంది చిట్టి బిక్కుబిక్కుమని అతని మొహం కేసి చూస్తూ.

"ఊహూ. అలాగా!" అంటూ దేవుడి గదిలోకి వెళ్ళిపోయి, కొన్నిక్షణాల తర్వాత బయటి కొచ్చాడు - చేతిలో తాళం చెవులున్నాయి. అతను తిన్నగా బీరువా దగ్గరి కొచ్చాడు. బీరువాని తీసిందే తడవుగా అందులో వున్న బట్టల్ని చిందరవందర చేశాడు. చివరికి తనకు కావలసిన డబ్బు దొరికింది. అతనిమొహం వికసించింది. యథాప్రకారం బీరువాకి తాళం వేసేసి, తాళం చెవుల్ని దేవుడి గదిలో పెట్టేసి వచ్చేశాడు.

చిట్టి భయం భయంగా మూలలో నక్కి వుంది.

అతను తప్పకుండా దొంగయి వుంటాడనపించింది చిట్టికి. రాత్రి అమ్మ చెప్పిన 'దొంగ' లాగే వున్నాడతను. అందులోను తమ డబ్బు కూడా తీసుకుపోతున్నాడు!

'దొంగ' వెళ్ళిపోతూ, పోతూ చిట్టికి ఓ ముద్దు యిచ్చి వెళ్ళిపోయేడు.

చిట్టికి ఏడుపు వచ్చేసింది..

'దొంగ' అలా వెళ్ళిన మూడునిమిషాలకల్లా శ్యామల స్టోరునుంచి చక్కెర మోసుకు వచ్చింది.

తల్లి వస్తూనే - "అమ్మా! మనింటికి దొంగ వచ్చి వెళ్ళాడే" అంటూ బావురుమంది చిట్టి.

శ్యామల నవ్వుతూ - "దొంగేంటే!!! ఎప్పుడొచ్చాడూ? నిజంగా!" అంది హాస్యంగా.

"అవునమ్మా! నిజ్జంగానే దొంగ...మన బీరువా తీసి డబ్బు తీసికెళ్ళాడమ్మా!" అంది చిట్టి ఏడుపు గొంతుతోనే. పాప అలా చెప్పేటప్పటికి అనుమానం వేసి వెంటనే బీరువా తీసి చూసింది. బాగా ఇస్త్రీ చేసిపెట్టిన బట్టలన్నీ చిందరవందరగా పడున్నాయి. డబ్బు చూసుకుంది. అందులో డబ్బు లేదు! అంతకు ముందురోజు రాత్రి భర్త తన సెలవుజీతంగా రెండువేల రూపాయలు తెచ్చి యిచ్చాడు. ఆ డబ్బుతో మిక్సీ కొందా మనుకొంది కూడా. శ్యామల గుండెలు పగిలిపోయాయి! సాయంత్రం భర్త వస్తే ఏం సమాధానం చెబుతుంది తను!

"ఎలాగున్నాడే దొంగ?" అంది వణుకుతున్న కంఠంతో.. ఏడుపు ముంచుకొస్తోంది శ్యామలకి.

తనకు వచ్చిన తీరులో దొంగను వర్ణించి చెప్పింది చిట్టి.

చిట్టి చెప్పే వర్ణన ఎవరిదో శ్యామలకైతే అంతుబట్టనే లేదు.

ఇరుగూ పొరుగూ ఇళ్ళవాళ్ళని విచారించింది. 'మీ ఇంటివేపే మేము చూడలే' దన్నారు - వాళ్ళు.

సాయంత్రం భర్త వచ్చాక, అతనడిగే యక్ష ప్రశ్నలకీ సమాధానం చెప్పడం కంటే ఎక్కడికయినా పారిపోవడం క్షేమదాయకం అనిపిస్తోంది శ్యామలకు - చిట్టి మొహం చూసి ఆ ఆలోచనను విరమించుకుంది.

ఇరుగూ పొరుగు ఆడవాళ్ళు అందరూ ఇంట్లోకి వచ్చేశారు. అందరినోటా ఒకటేమాట - "ఎవరయినా పసిపిల్లని ఇంట్లో వుంచి స్టోరు కెళ్తారా?" అని.

"వారం కిందట మా చెల్లెలి వాళ్ళింట్లో కరెంటు మీటరు చూసేదానికని ఎవడో వచ్చి...మేడ మీద వున్న మీటర్ని చూసే సాకుతో టేపు రికార్డరు తీసికెళ్ళాడు శ్యామలా!" అంది ఎదురింటి వనజ.

"మొన్న ఆదివారంనాడు- జీసస్‌నగర్‌లో మా ఫ్రెండు వాళ్ళు ఉదయం తొమ్మిందింటికి చర్చికి వెళ్ళారు...సరిగ్గా ఆ సమయం చూసుకొని ఎవరో ఇద్దరు దొంగనాకొడుకులు ఆ ఇంటి తాళం తీసి వాళ్ళ కలర్ టీవీని తీసికెళ్ళారు. ఇదంతా చూసిన ఆ చుట్టు పక్కల వాళ్ళు ఆ దొంగనాయాండ్లని మా ఫ్రెండువాళ్ళ బంధువులేమో, లేకపోతే అంత నిర్భయంగా ఎలా తీసుకు వెళ్తున్నారు టీవీని అనుకున్నారట - చూడు శ్యామలక్కా! దొంగతనాలు ఎంతపబ్లిగ్గా జరుగుతున్నాయో! ఇంక పసిపాప వున్న ఇంట్లో డబ్బు దొంగిలించుకెళ్ళడం ఏం పెద్ద విషయం చెప్పు! ముందు పోలీసు కంప్లయింటు ఇవ్వండి!" అంది పక్కింటి సుబ్బలక్ష్మి.

ఈ విషయం వినడంతో హడలిపోయింది శ్యామల. సరే అయ్యేదేదో అయ్యింది. ముందీ విషయం తన భర్తకు తెలియజేయాలి అనుకుంది. అనుకున్నదే తడవుగా పక్కింటి నారాయణమ్మ వాళ్ళబ్బాయికి చెప్పింది -"బాబూ! తాలూకాఫీసులో మావారుంటారు... మీ ఇంట్లో 'దొంగ'లు పడ్డారండీ!' అని చెప్పిరావా?" అని అలా 'దొంగ' కు 'లు' చేర్చకపోతే ఆయన ఆఫీసు వదిలి రాడని శ్యామల నమ్మకం.

పక్కింటబ్బాయి 10 నిమిషాల్లో తిరిగొచ్చేసేడు. చేతిలో ఓ చీటీతో. అందులో ఇలా ఉంది -

"ఇంట్లో దొంగలు పడితే సాయంత్రం పోలీసు రిపోర్టు ఇవ్వవచ్చు.... ఇప్పుడు మా ఆఫీసులో దొరలుపడ్డారు (అంటే జాయింటు కలెక్టరూ, ఆర్డీవోలు) కాబట్టి సాయంత్రానికిగానీ రాలేను"

ఆఫీసే జీవితంగా బతికే మొగుడికి అదొక్క కారణంగా విడాకులు ఎందుకివ్వ కూడదు? అనిపించింది శ్యామలకి - ఆ క్షణంలో.

★ ★ ★

సాయంత్రం ఆరున్నర గంటలయింది.

శ్యామల వంటింట్లో స్టౌ మీదవుంచిన పాలుపొంగు వస్తోన్న గిన్నెనే గమనిస్తోంది. ఆమె మనసు దుఃఖంతో గుబులు, గుబులుగా వుంది. తనింత బాధపడుతూ వుంటే- ఎంతకీ రాని మొగుడుని తలుచుకుంటూంటే తన రక్తం సలసల కాగిపోతూ వుంది, తీరా అతనొచ్చాక - డబ్బు పోయింది. తన నిర్లక్ష్యం వల్లనే అని తనని తిడితేనో- అని అనుకుంటే గుండెలు అవిసిపోతున్నాయి.

"అమ్మా! అమ్మా!!" అంటూ బయటినుంచి చిట్టి కేకలు!

"ఏం చిట్టీ!" అంటూ ఇంట్లోంచి బదులు కేకలేసింది శ్యామల.

"అమ్మా! దొంగ వచ్చాడే!' అంటూ మళ్ళీ అరుపు, అదిరిపడి లేచింది.

"ఏడే, ఏడే..." అంటూ ఆత్రంగా వచ్చింది.

"అద్దో ఆ గదిలో" అంది చిట్టి.

గుండెలు అదురుతుండగా భయం భయంగా గదిలోకి తొంగి చూసింది.

"ఎక్కడమ్మా దొంగ?" అన్న స్వరం గదిలోంచి.

"నువ్వే దొంగవి!" అంది సీరియస్‌గా మొహం పెట్టి చిట్టి.

శ్యామలకి నవ్వాలో ఏడవాలో తెలియలేదు.

"నేను దొంగని కాదమ్మా మీ నాన్నని" అన్నాడతను లుంగీ చుట్టుకుంటూ.

"మీరు దానికి నాన్న అని దానికేం తెలుసండి. పాపం! అది ఈరోజు చూస్తోంది మిమ్మల్ని. అది ఇంకా నిద్రలేవకుండానే పొద్దున్నే ఆఫీసో ఆఫీసంటూ వెళ్ళిపోతారు. అది నిద్రపోయాక గానీ రాత్రిళ్ళు ఆఫీసునుంచీ రారు. ఇక ఆదివారాలూ, పండుగ సెలవుల్లో కూడా ఆఫీసునే పట్టుకుని వేలాడుతూ ఉంటారాయె. మరేమయినా మాట్లాడితే ఆఫీసు ఇన్‌స్పెక్షనంటారు, జమాబందీ అంటారు. మీ గుమస్తాలకి ఆఫీసే పెళ్ళాం పిల్లలూ" అంది విసుగ్గా, బాధగా – కన్నుల్లో నీటిపొర కమ్మేస్తుండగా.

చిట్టి మాత్రం దొంగను చూసినట్టే చూస్తోంది- తండ్రిని.

(ఆదివారం ఆంధ్రజ్యోతి – 18 నవంబర్, 1990)